# అంతిమ సంస్కారం

ఆగదిలో వున్నవారంతా నన్ను దోషిలా చూస్తున్నారు. నామీద నడుస్తున్న డిపార్ట్‌మెంటల్ ఎంక్వయిరీ నిమిత్తం వచ్చిన మా జోనల్ ఆఫీసు అధికారి గారి ముఖం మాత్రం ప్రశాంతంగా వుంది.

నేను తప్పుచేశాను. నా కిందిస్థాయి ఉద్యోగి నరసింహాన్ని కొట్టాను. నరసింహం నాకెదురుగా కుర్చీలో కూర్చున్నాడు. కొట్టిన గుర్తుగా అతడి కుడి దవడ ఉబ్బి వుంది. బుగ్గలమీద ప్లస్‌గుర్తు బ్యాండేజీ ఒక పన్ను విరిగి నరసింహం చూడడానికి వికారంగా కనిపిస్తున్నాడు. డిపార్టుమెంటు తరపున వాదించడానికి వచ్చిన అధికారి చెప్పడం ప్రారంభించారు.

"ఈయన పేరు పార్థసారథి మన కంపెనీ ప్రాంతీయ కార్యాలయంలో అధికారి. ఈయన చేతిలో దెబ్బలుతిన్న నరసింహం మన అనకాపల్లి బ్రాంచిలో గుమస్తాగా పనిచేస్తున్నారు. నరసింహం తండ్రిగారు చనిపోయి పదిరోజులయ్యింది. మన కంపెనీ నిబంధనల మేరకు ఎవరైనా ఉద్యోగి తండ్రిచనిపోతే, దహన క్రియల ఖర్చుల నిమిత్తం ఐదువేల వరకూ శాంక్షన్ చేయబడ్తుంది. దానికి నరసింహం దరఖాస్తు చేసుకున్నాడు. పార్థసారధికి ఆ మొత్తం శాంక్షన్ చేసే అధికారం వుంది. అయినప్పటికినీ ఆయన శాంక్షన్ చెయ్యలేదు సరికదా, అడగడానికొచ్చిన నరసింహాన్ని విచక్షణా రహితంగా కొట్టారు" అయన చెప్పడం ఆపి కూర్చున్నారు.

నరసింహం రెండు రోజులక్రితం నా కేబిన్‌లోకి వచ్చిన విషయం గుర్తుకొచ్చింది. వచ్చిన వెంటనే "మా నాన్నగారు చనిపోయారు..." అన్నాడు. నేను తలెత్తకుండానే "తెలుసు" అన్నాను, ముక్తసరిగా.

"కర్మకాండకు చాలా ఖర్చయ్యింది. అప్పు చేశాను. కాశీకి వెళ్ళాల్సి వచ్చింది" అన్నాడు.

నేను ఏమనకుండా మౌనంగా ఊరుకున్నాను.

"ఫ్యూనరల్ ఖర్చుల నిమిత్తం ఇచ్చే ఐదువేలకు అప్లికేషన్ పెట్టాను" అన్నాడు నరసింహం.

"మీకు డబ్బులు శాంక్షన్ కావు....." అన్నాను.

"ఎందుకివ్వరో కారణం చెప్పండి!" అన్నాడు.

"కారణం మీకూ తెలుసు...." అన్నాను.

"ఎంతకాలం ఇవ్వరో నేనూ చూస్తాను. నా వెనుక యూనియన్ వుంది" అంటూ గట్టిగా అరిచాడు.

"ఏంచేస్తావో నీ ఇష్టంవచ్చినట్లు చేసుకో, నీకు మాత్రం పైసారాదు" అన్నాను కోపంగా.

"ఏమిటండీ ఈ అమానుషం. మేనేజ్‌మెంట్ దౌర్జన్యం నశించాలి..." అని అరవడం మొదలెట్టాడు.

నేను వెంటనే అతడి దవడమీద బలంగా గుద్దాను. అనుకోని ఈ పరిణామానికి విస్తుపోతూ నోటికి వచ్చినట్లు బూతులు తిట్టడం ప్రారంభించాడు.

నా ఇష్టం వచ్చినట్టుగా అతడిని బాదాను. అతడి ముక్కులోంచి రక్తం కారింది. పన్ను విరిగింది. ఆఫీసులో ఉద్యోగులు నన్ను పక్కకులాగారు. యూనియన్‌వాళ్ళు

మా జోనల్ ఆఫీసుకు ఫ్యాక్స్ పంపారు.

ఆ తర్వాత పరిణామాలు వేగంగా జరిగాయి.నన్ను సస్పెండ్‌చేశారు. నా మీద డిపార్ట్‌మెంట్ ఎంక్వయిరీ వేశారు. నేను చేసినదానికి నరసింహానికి క్షమాపణచెపితే కేసు వెనక్కి తీసుకుంటామంటూ యూనియన్ నాయకులు సలహా ఇచ్చారు. నేను అందుకు ఒప్పుకోలేదు. ఫలితంగా ఈ రోజు ఈ ఎంక్వయిరీ...

నేను నా జీవితంలో ఎవరినీ పల్లెత్తుమాట అనలేదు. ఎవరినీ కొట్టిన సందర్భమూలేదు. నరసింహంపై చెయ్యి చేసుకోవడం నా సన్నిహితులకు ఆశ్చర్యం కలిగించింది. ఇదంతా ఎలా జరిగిందా అని. అసలు నాకే ఆశ్చర్యం కలుగుతోంది. "మిస్టర్ పార్థసారథి. ఏమిటీ ఆలోచిస్తున్నారు. మీమీద మోపబడిన అభియోగం గురించి విన్నారుకదా, దీనికి మీ సంజాయిషీ ఏమిటి" అన్నాడు ఎంక్వయిరీ అధికారి నావంక అదోలా చూస్తూ.

ఆలోచనల్లోంచి బైటకొచ్చి, "సార్ నేను నరసింహాన్ని కొట్టడం వాస్తవం. అయితే ఎందుకుకొట్టానో మీకు వివరించాల్సిన అవసరంవుంది. నాకు కొంచెం టైమ్ ఇవ్వండి" అన్నాను. అలాగే అన్నట్లు ఆయన తలూపి, స్టెనోగ్రాఫర్ వంక చూసి రాసుకోమంటూ సైగచేశాడు. నేను చెప్పడం ప్రారంభించాను.

"నేను సంవత్సరం క్రితం తిరుపతి వెళ్ళాల్సివచ్చింది. తిరుపతిలో మా ఇంటిస్థలం తగాదాల్లోవుంది. దానిగురించి అర్జెంటుగా వెళ్ళాల్సొచ్చింది. రిజర్వేషను లేదు. స్టేషనులో ట్రెయినుకై ఎదురుచూస్తున్నాను. ఇంతల్లో ఓ ముసలాయన నాదగ్గరకొచ్చాడు. ఆయన వయసు డెబ్బై దాటింది. పొడుగ్గా సన్నగావున్నాడు. నీరు కావిరంగు పంచె, ఖద్దరు చొక్కా, భుజంమీద కండువా, చేతిలో సంచి, 'మీకు రిజర్వేషను కావాలా?!' అంటూ నవ్వుతూ అడిగాడు. 'నిజంగానా! మోసంలేదు కదా?' అన్నాను ఆయన్ని అనుమానంగా చూస్తూ. 'లేదండీ.... నేను స్వాతంత్ర్యసమరయోధుడిని నాకు ప్రభుత్వం వారిచ్చిన పాస్ వుంది. ప్రయాణాల్లో నేను నాతో పాటు ఒక అటెండెంటును తీసుకుని వెళ్ళవచ్చు. అంచేత మీరు నా

అటెండెంటుగా రావచ్చును. మీకు తోచినంతివ్వండి' అన్నాడు.

ఆ సమయంలో ఆయన నాకు దేవుడిలా కనిపించాడు. ఆయన అటెండెంటుగా నా తిరుపతి ప్రయాణం ప్రశాంతంగా సాగింది. ఆయనపేరు విశ్వనాథం. మీకెవరికైనా తెలుసా!" అంటూ నరసింహం వంక నిశితంగా చూశాను. నరసింహం ఏమీ మాట్లాడలేదు.

నేను మళ్ళీ చెప్పడం మొదలెట్టాను. "మళ్ళీ రెండోసారి విశ్వనాథంగారిని రైల్లోనే తిరుపతి వెళుతూ కలిశాను. ఆయన ఒక వ్యక్తితో బేరంకుదుర్చుకుని తిరుపతి బయలుదేరారు. అయితే ఈసారి ఆయన్ని నేను కొంచెం కోపంగా అడిగాను 'అయ్యా మీరు స్వాతంత్ర్య సమరయోధుడు అయివుండీ స్వాహాతంత్రంతో ప్రభుత్వం ఇచ్చిన రాయితీని ఈ విధంగా దుర్వినియోగం చెయ్యడం ఏమన్నా భావ్యమా!?' అన్నాను.

ఆయన నేనన్న మాటలకు క్షణంసేపు బాధపడినట్టు కనిపించినా వెంటనే తేరుకుని - 'అయ్యా నన్ను క్షమించండి. నాకువేరే ఆధారంలేదు. ఒక్కగానొక్క కొడుకు. వాడికి తల్లిలేదు. కొడుకు పెళ్ళి ఘనంగా చెయ్యాలనే కలలుకనేది. ఆ కలతీరకుండా చనిపోయింది...' అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. నాకు బాధకలిగింది. ఆయన్ని అనవసరంగా బాధ పెట్టాననుకునేంతలో మళ్ళీ కొనసాగించాడు.

'నా కొడుకు చదువుకోసం ఇల్లు అమ్మేశాను. ఇప్పుడు వాడి పెళ్ళిచెయ్యాలి. అందుకోసం ఇలా కష్టపడుతున్నాను. వాడి పెళ్ళి కాలేదనే బెంగతో వాడి తల్లి చనిపోయింది. నేను ముసలివాడినయిపోయాను. తొందరగా వాడి పెళ్ళి చెయ్యాలి, అందుకు డబ్బు కావాలి. మీరుండేది వైజాగులోనే కాబట్టి మిమ్మల్ని నా కొడుకు పెళ్ళికి పిలుస్తాను' అన్నాడు.

అందరూ ఆసక్తిగా వింటున్నారు. అసలు నేను నరసింహాన్ని ఎందుకు కొట్టానో అందుకు కారణం ఏమిటీ! అంటూ మధ్యమధ్యలో ప్రశ్నలువస్తున్నా, నేను నా ధోరణిలో చెప్పడం కొనసాగించాను.

"ఔను... రైల్లో చెప్పినట్టుగానే విశ్వనాధంగారు నన్ను వాళ్ళబ్బాయి పెళ్ళికి పిలిచారు. నిజంగా చాలా ఘనంగా పెళ్ళిచేశారు. ఆయన తాహతుకు మించి ఖర్చు చేశారనిపించింది. అయితే మళ్ళీ ఆయన మూడోసారి తిరుపతి వెళ్ళేరైల్లోనే తగిలారు. నేను వెంటనే అడిగాను. 'ఎందుకు మళ్ళీ మీకు ప్రయాణాలు. హాయిగా కొడుకు దగ్గరేవుండొచ్చు, పెళ్ళయిపోయింది కదా!' అని.

ఆయన క్షణం సేపు మాట్లాడలేదు. ఆ తర్వాత తనే చెప్పలేక చెప్పారు. 'బాబూ వాడికోసమే నేను బతుకుతున్నాను. పెళ్ళయినతర్వాత కొత్తగా అపార్టుమెంటు కొనుక్కొని వేరేగా వెళ్ళిపోయాడు. కొత్తదంపతులమధ్య నేనెందుకని ఓల్డేజిహోంలో చేరాను. అయితే....' అంటూ చెప్పడం ఆపి కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు.

ఎందుకు విశ్వనాధంగారు ఏడ్చారో తెలుసా!? ఆయన వృద్ధుల ఆశ్రమంలో చేరుతుంటే కొడుకు ఆయన్ని ఆపనందుకు. అభిమానవంతుడైన విశ్వనాధంగారు కొడుక్కి భారం ఎందుకని తనతోవచూసుకున్నారు. అసలు తిరుపతే ఆయన తరచుగా ప్రయాణాలు పెట్టుకోవడానికి కారణం స్వామివారి కోవెలలో దొరికే ఉచిత భోజనం" అంటూ ఆపి నరసింహం ముఖంలోకి చూశాను. అతడి ముఖంలో ఏ భావమూలేదు".

ఇంతలో కేసు నిమిత్తం వచ్చిన ఎంక్వయిరీ అధికారి నా మాటలకు అడ్డొస్తూ, "మిస్టర్ పార్థసారధీ... మీరు రైల్లో పరిచయమయిన ఆ స్వాతంత్ర్యసమరయోధుడి జీవితం గురించి చెపుతున్నారు. ఆయనకూ, నరసింహాన్ని మీరు కొట్టడానికి ఏమిటీ సంబంధం..." అన్నారు.

"అయ్యా నేను ఇక ఈ కథ ముగించబోతున్నాను. పూర్తయ్యేలోగా విషయం మీకే అర్థమవుతుంది" అంటూ మళ్ళీ చెప్పడం ప్రారంభించాను.

"నాలుగోసారి మళ్ళీ పదిరోజుల క్రితం అదే పనిమీద నేను తిరుపతి వెళ్ళాను. అయితే ఈ సారి విశ్వనాధం గారు నాకు రైల్లో కనిపించలేదు.

అయితే తిరుపతి లోకల్ న్యూస్ పేపర్లో ఒక వార్తా కథనం చదివాను"

అంటూ చెప్పడం ఆపాను. అందరూ నా వంక రెప్ప ఆర్పకుండా చూస్తున్నారు.

నేను క్షణం సేపు ఊపిరి పీల్చి వదిలి, "ఆ వార్తా కథ ఒక దిక్కులేని శవంగురించి" అంటూ నరసింహం ముఖంలోకి చూశాను. అతను తలొంచుకున్నాడు.

నేను చెప్పడం కొనసాగించాను. "వైజాగులో రైలెక్కి ఒక డెబ్బై ఏళ్ళ ముసలాయన తిరుపతి చేరేసరికి నిర్జీవంగా కనిపించాడని, ఆయన శవాన్ని తిరుపతి స్టేషనులో దించి ఆయన కొడుక్కు సమాచారం పంపినా ఆ కొడుకు నుంచి ఏ స్పందనా రాకపోవడంతో, రైల్వేవారు రైల్వే ఆసుపత్రిలోని మార్చురీలో ఆ శవాన్ని దిక్కులేని శవంగా పరిగణించి వుంచారనే వార్త... ఆ ముసలాయన మీకందరికీ తెలిసిన వ్యక్తే...." అంటూ ఆపాను.

"ఆయన విశ్వనాధం గారు కదా" అన్నారు అంతా. నరసింహం మాత్రం పెదవి విప్పలేదు.

"ఆయన శవం ఇప్పటికీ మార్చురీలోని ఫార్మాలిన్ ద్రావణంలో తేలుతోంది. అదీ తిరుపతి రైల్వే ఆస్పత్రిలో..." అంటూ నరసింహం వంక రెప్ప ఆర్పకుండా చూశాను. నరసింహంలో ఏ చలనమూలేదు. నేను వెంటనే లేచి నిల్చోని ఎంక్వయిరీ ఆఫీసరుగారికి నమస్కారంపెట్టి, "అయ్యా, ఇంతసేపు ఓపికగా నేను చెప్పిందంతా విన్నందుకు కృతజ్ఞతలు. అయితే ఒక్కమాట చెప్పి స్టేట్మెంట్ ముగిస్తాను" అన్నాను.

"సరే కానివ్వండి" అన్నారు ఆ ఆఫీసరు.

"తండ్రి గొప్పదనం కొడుకు పెళ్ళిలో తెలుస్తుంది. కొడుకు ప్రయోజకత్వం తండ్రి చావులో తెలుస్తుంది. ఈ మాటలు చెప్పింది ఎవరో నాకు తెలీదు, ఇలా చెప్పిన ఆ మహానుభావుడికి పాదాభివందనం..." అంటూ చెప్పడం ముగించి కూర్చున్నాను.

ఈసారి నరసింహం వంక చూడలేదు. అతడిని చూడడం ఇష్టంలేక కళ్ళు మూసుకున్నాను.

ఇంతలో అందరికీ ఆశ్చర్యం కలిగించేలా నరసింహం ఏడవడం ప్రారంభించాడు. గుండుసూదితో గుచ్చితే మెల్లగా వచ్చే రక్తంలా అతని కళ్ళనించి మెల్లగా వస్తున్న కన్నీళ్ళు. అవి క్రమేపి ఉధృతంగా మారాయి.

*స్వాతి సపరివారపత్రిక, 24-6-05*

* * * * *